అంబులెన్స్ అందని ద్రాక్షే..



ఇటిక్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

- మండలానికి 108 సౌకర్యం కరువు
- ప్రభుత్వం మారినా తీరని సమస్య
- ఆపదొస్తే ప్రైవేట్ వాహనాలే దిక్కు

ఎర్రవల్లి: ఉమ్మడి ఇటిక్యాల మండలంలో వరుసగా చోటు చేసుకుంటున్న రోడ్డు ప్రమాదాల వల్ల స్థానికంగా అంబులెన్స్ (108) అందుబాటులో లేకపోవడంతో నిత్యం ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రమాదాలు జరిగిన వెంటనే ఆస్పత్రికి తరలించేందుకు అంబులెన్స్ కోసం స్థానికులు, పోలీసులు ప్రయత్నించినా.. ఇటిక్యాల మండలంలో ప్రభుత్వ అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ వాహనాల్లో క్షతగాత్రులను తరలించాల్సిన పరిస్థితి నెలకొంది. అత్యవసర పరిస్థితుల కోసం మొదట ప్రతి మండలంలోని ఆస్పత్రికి వైద్య ఆరోగ్యశాఖ 108 లను కేటాయించింది. కానీ ఇటిక్యాల మండలానికి ఈ వసతి అందని ద్రాక్షలా మిగిలిపోయింది.

మండలంలో 60వేల జనాభా

ఉమ్మడి ఇటిక్యాల మండలంలో మొత్తం 29 గ్రామ పంచాయతీలు ఉండగా.. దాదాపుగా 60వేలకు పైగా జనాభా ఉంది. ఇంత జనాభాకు ఒకే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండటంతో పాటు కేవలం 9 హెల్త్ సబ్‌సెంటర్లు మాత్రమే ఉన్నాయి. కానీ 108 సౌకర్యం మాత్రం స్థానికంగా అందుబాటులో లేదు. ఇక్కడ 44వ జాతీయ రహదారితో పాటు మండల కేంద్రానికి డబుల్ రోడ్డు, ఎర్రవల్లి–రాయిచూరు అంతరాష్ట్ర రహదారి ఉండటంతో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రయాణికులు గాయాలపాలవుతున్నారు. ఇలాంటి అత్యవసర పరిస్థితుల్లో సుమారు 25 కిలోమీటర్ల దూరం నుంచి పెబ్బేరు, గద్వాల ఆస్పత్రులకు చెందిన అంబులెన్స్‌లు రావడంలోపే సగానికి పైగా ప్రాణాలను కోల్పోతున్నారని ప్రజలు వాపోతున్నారు.

అత్యవసరమైతే అంతే..

కొండపేటకు చెందిన వ్యక్తి యాక్తాపురం స్టేజీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా.. సకాలంలో అంబులెన్స్ రాకపోవడంతో ఘటన స్థలంలోనే అరగంట కావడంతో అక్కడికక్కడే ప్రాణాలను కోల్పోయాడు. అదేవిధంగా యాక్తాపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి బీచుపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా సకాలంలో అంబులెన్స్ రాకపోవడంతో అక్కడే ప్రాణాలను కోల్పోయాడు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి తక్షణమే మండలానికి అంబులెన్స్ సౌకర్యం కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు తప్పడం లేదు



ఇటిక్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మొదటి నుంచి అంబులెన్స్ సౌకర్యం లేనందున మండల ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజల పరిస్థితి మాత్రం ఎంతో దారుణంగా తయారైంది. గర్భిణులకు పురిటినొప్పులు వస్తే ఆస్పత్రికి తీసుకెళ్లడానికి స్థానికంగా అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సి వస్తోంది.

– బస్వలింగం, కారుపాకుల

అంబులెన్స్ ఏర్పాటు చేయాలి..



తక్కువ జనాభా ఉన్న మండల కేంద్రాలకు సైతం అంబులెన్స్ సౌకర్యం కల్పించారు కానీ పెద్ద మండలం అయిన ఇటిక్యాల ఆరోగ్య కేంద్రానికి 108 సౌకర్యం కల్పించలేదు. అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రికి వెళ్లేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సమస్యను పరిష్కరించాలని పాలకులు, అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడంలేదు.

– వీరేష్, ఎర్రవల్లి

ఉన్నతాధికారులకు విన్నవించాం.



మండలంలో 108 సౌకర్యం లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పలుసార్లు ఉన్నతాధికారులు, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం. మరోసారి సమస్యను వివరించి, త్వరలోనే అంబులెన్స్ సౌకర్యం కల్పించేందుకు కృషిచేస్తాం.

– డాక్టర్ ప్రసూనరాణి, మండల వైద్యాధికారి

క్లుప్తంగా

ఎంఈఓకు సన్మానం



అయిజ: మండలంలో ఇన్‌చార్జ్ ఎంఈఓగా పని చేసి బదిలీపై వెళ్లన్న నరసింహకు మండల కేంద్రంలోని కృష్ణవేణి పాఠశాలలో శుక్రవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ఇన్‌చార్జ్ ఎంఈఓ నరసింహను శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాబు నాయుడు, బీచుపల్లి, మోయిన్ పాషా, రమేష్ బాబు, బాల వెంకటరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు రెన్యువల్ పనులకు శంకుస్థాపన



మానవపాడు: మండలంలోని అమరవాయి గ్రామం నుంచి కలుకుంట్ల గ్రామం వరకు వెళ్లే బీటీ రోడ్డుకు రెన్యువల్ కోట్ పనులకు శుక్రవారం ఎమ్మెల్యే విజేయుడు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీటీ రోడ్డు పనులను నాణ్యతతో నిర్మించాలని కాంట్రాక్టర్లకు సూచించారు. బీటీ రోడ్డు రెన్యువల్ రూ. 3.33 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో దామోదర్‌రెడ్డి, గొల్ల వెంకట్రాముడు, గంగు శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణోత్సవ సభను విజయవంతం చేయండి



అయిజ: పీడీఎస్‌యూ 50 వసంతాల స్వర్ణోత్సవ సభను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీంపాషా కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో పీడీఎస్‌యూ నాయకులు పోస్టర్లు విడుదల చేశారు. ఈసందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ ఈనెల 24న ఉస్మానియా యూనివర్శిటీలోని ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించనున్న పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ సభలో విద్యార్థి అమరవీరుల స్ఫూర్తితో భవిష్యత్ విద్యారంగ సమస్యల పరిష్కారానికి ప్రణాళిక చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శేఖర్, అభిస్, అజయ్, ఉదయ్, రియాజ్, కార్తీక్, యుగేందర్, నితీష్, రవి పాల్గొన్నారు.

కాంతమ్మకు పరామర్శ



అలంపూర్: పట్టణంలోని సంతోష్‌నగర్ కాలనీకి చెందిన కాంతమ్మను యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు దీపక్ ప్రజ్ఞ శుక్రవారం పరామర్శించారు. యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు దేవరపోగు నరసింహ తల్లి కాంతమ్మ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న జిల్లా అధ్యక్షుడు వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కృష్ణకాంత్, రాజేష్ తదితరులు ఉన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం



మల్దకల్: గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ స్వరూపరాణి సూచించారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ గర్భిణులు పోషకాలు ఎక్కువగా ఉండే పాలు, గుడ్లు, ఆకుకూరలను ఎక్కువగా తీసుకోవాలన్నారు. ముఖ్యంగా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

ఐఎఫ్‌టీయూ విలీన సభ పోస్టర్ విడుదల



కార్మికులతో కలిసి పోస్టర్‌ను విడుదల చేస్తున్న క్రిష్ణ

ధరూరు: హైరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 20న నిర్వహించే ఐఎఫ్‌టీయూ విలీన సభ పోస్టర్‌ను శుక్రవారం ధరూరులోని వైఎస్సార్ చౌరస్తాలో ఐఎఫ్‌టీయూ అనుబంధం తెలంగాణ ప్రగతిశీల భవన నిర్మాణ సంఘం ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి చింతరేవుల క్రిష్ణ మాట్లాడుతూ.. విలీన బహిరంగ ప్రకటన తరువాత టీయూసీఐగా తెలంగాణలో కొనసాగుతుందన్నారు. ఐఎఫ్‌టీయూను అంత సులభంగా వదులుకోమని, రాష్ట్రంలో కార్మిక వర్గానికి పేగుబంధం లాంటిదన్నారు. కార్మికులకు కనీస వేతనాలు, ఈఎస్‌ఐ, ఈపీఎఫ్, గ్రాట్యూటీ, పెన్షన్లు లేకుండా చేయడంతో పాటు ప్రభుత్వాలు ఉద్యోగ భద్రత కల్పించలేకపోతున్నాయని మండిపడ్డారు. అంతకు ముందు రేవులపల్లి డ్యాం వద్ద మిషన్ భగీరథ వర్కర్స్‌తో కలిసి పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో మహేష్, వెంకటేష్, మద్దిలేటి, రాజు, నర్సింహులు, అశోక్, వీరన్న, రవి కుమార్, సుదర్శన్, బాబు, వెంకటన్న, దేవదాసు, తిప్పన్న, ముని పాల్గొన్నారు.

మంత్రి పొన్నంకు ఘన స్వాగతం

ఎర్రవల్లి: మండల కేంద్రంలో శుక్రవారం రాష్ట్ర రోడ్డు రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. శుక్రవారం జిల్లాకు చేరుకున్న మంత్రి ముందుగా అలంపూర్ జోగుళాంబాదేవి ఆలయ దర్శనానికి వెళ్తుండగా.. ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో నాయకులు ఎర్రవల్లి కూడలిలో మంత్రిని కలిసి పుష్ప గుచ్చాలు అందించి శాలువాలతో సన్మానించారు. నాయకులు జోగుల రవి, వెంకటేష్ యాదవ్, కొప్పుల లక్ష్మీనారాయణరెడ్డి, శ్యామ్‌సుందర్, లోకారెడ్డి, రవి, ఆదాం పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు ప్రయత్నించాలి



మాట్లాడుతున్న ఉత్తరయ్య

వనపర్తి రూరల్: జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని చిట్యాల శివారులోని చేయూత అనాథ ఆశ్రమంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లీగల్ అండ్ డిఫెన్స్ కౌన్సిల్ ఉత్తరయ్య మాట్లాడుతూ నేటిబాలలే రేపటి పౌరులని, విద్యార్థులు కష్టపడి చదివి ఈ దేశానికి మంచి పేరును తీసుకురావాలన్నారు. ప్రతి విద్యార్థి లక్ష్య సాధన వైపు అడుగులు వేయాలని సూచించారు. లీగల్ హెడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీదేవి మాట్లాడుతూ 14 ఏళ్ల లోపు పిల్లలకు చదువు తప్పనిసరి అని, బాల్య కార్మిక వ్యవస్థను రూపుమాపాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు రేణుక, శోభారాణి, ప్రవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ



గోప్లాపూర్‌లో పశువులకు టీకాలు వేస్తున్న మండల పశువైద్యాధికారి

పాన్‌గల్: పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా అందిస్తున్న గాలికుంటు నివారణ టీకాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి డా.శ్యామ్ అన్నారు. శుక్రవారం మండలంలోని గోప్లాపూర్, మాందాపూర్, బుసిరెడ్డిపల్లి గ్రామాల్లో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేసినట్లు ఆయన పేర్కొన్నారు. పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయడం వలన రోగ నిరోధకశక్తి పెరుగుతుందని తెలిపారు. ప్రతి గ్రామంలో రైతులు అందుబాటులో ఉంటూ తమ పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎల్ఎస్ఏ సత్యనారాయణ, వీఏ బాలీశ్వర, పశువైద్య సిబ్బంది బుచ్చన్న, చంద్రయ్య, శివ, కార్తీక్, వెంకటయ్య, రైతులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు బాలుడి అప్పగింత



తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పెబ్బేరు పోలీసులు

వనపర్తి రూరల్: ఎర్రవల్లి చౌరస్తా నుంచి బాలుడు పృథ్వీక్ బస్సు ఎక్కి పెబ్బేరు బస్టాండ్‌లో దిగాడు. బస్టాండ్ పరిసరాల్లో తిరుగుతున్న బాలుడిని చూసిన ప్రయాణికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే వారు అక్కడికి చేరుకున్న పోలీసులు బాలుడిని స్టేషన్‌కు తీసుకొచ్చి వివరాలను సేకరించారు. గట్టు మండలంలోని బొయ్యగూడెం గ్రామానికి చెందిన సూర్యప్రకాష్‌శెట్టి, రమాదేవి దంపతుల కుమారుడి అని తెలుసుకొని సమాచారం అందించారు. వారు వెంటనే పెబ్బేరు పోలీస్‌స్టేషన్‌కు రాగా.. పోలీసులు బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు.

విత్తనశుద్ధి తప్పనిసరి



శాంతినగర్: పొలాల్లో విత్తనాలు నాటు వేసే ముందు విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలని ఏఈఓ భరతసింహ రైతులకు సూచించారు. వడ్డేపల్లి మండలంలోని తిమ్మాజిపల్లిలో రైతులకు మొక్కజొన్న, వేరుశనగ, పప్పుశనగ పంటల సాగులో మెలకువలు, విత్తన శుద్ధి యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు. అంతేగాక విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు ఏఈఓ అవగాహన కల్పించారు.

‘ఏపీజీవీబీ’లో అధికారుల విచారణ

శాంతినగర్: ఏపీజీవీబీ శాంతినగర్‌లో ఉన్నతాధికారులు శుక్రవారం విచారణ చేపట్టారు. బ్యాంకులో పనిచేసే ఫీల్డ్ ఆఫీసర్ దళారులతో కుమ్మక్కై లంచాలు ఇచ్చిన రైతులకే పంట రుణాలు ఇస్తున్నాడని, నేరుగా బ్యాంకుకు వెళ్లి లోన్‌లు అడిగితే దాట వేస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని బ్యాంకు ఎదుట రైతులు ధర్నా చేసిన విషయం తెలిసింది. స్పందించిన ఏపీజీవీబీ ఉన్నతాధికారులు వనపర్తి శాఖ నుంచి ప్రత్యేకాధికారులను శాంతినగర్‌కు పంపి విచారణ చేపట్టారు. రైతులకు అన్యాయం చేసే అధికారులపై చర్యలు తీసుకోవాలని వడ్డేపల్లి మండలంలోని ఆయా గ్రామాల రైతులు కోరారు.

విజేతలకు నగదు బహుమతులు



ధరూరు: క్రీడల్లో గెలుపోటములు సహజమని, ప్రతి క్రీడాకారుడు తన ప్రతిభను కనబర్చేందుకు గ్రామీణ క్రీడలు ఎంతగానో దోహదం చేస్తాయని కాంగ్రెస్ పార్టీ మండల యువజన నాయకుడు చిట్టెం పురుషోత్తంరెడ్డి అన్నారు. వాల్మీకి జయంతిని పురస్కరించుకుని మండలంలోని ర్యాలంపాడులో రెండు రోజులుగా నిర్వహించిన వివిధ క్రీడల్లో గెలుపొందిన విజేతలకు మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి ఇచ్చిన నగదు బహుమతులను వారు శుక్రవారం క్రీడాకారులకు అందజేశారు.

బీచుపల్లి పుణ్యక్షేత్రంలో ప్రత్యేక పూజలు



ఎర్రవల్లి: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని /జ్ఞాన సరస్వతి ఆలయంలో శుక్రవారం అర్చకులు అభిషేకం, కుంకుమార్చన చేశారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో బీచుపల్లికి చేరుకొని భక్తిశ్రద్ధలతో సరస్వతీదేవిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

చలో హైదరాబాద్ దీక్ష కరపత్రాలు విడుదల



ఉండవెల్లిలో కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద చలో హైదరాబాద్ నిరసన దీక్షకు సంబంధించిన కరపత్రాలను హోలియ దాసరి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రామచందర్ ఆధ్వర్యంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ నిమిత్తం జస్టిస్ డా.షమీం అక్తర్ నేతృత్వంలో తెలంగాణ ప్రభుత్వం ఏకసభ్య కమిషన్ వేసి 60 రోజుల్లోగా సమగ్ర సిఫార్సులతో నివేదిక అందజేయాలని కమిటీకి సూచించారన్నారు. కార్యక్రమంలో నాగరాజు, వేణుగోపాల్, బీమన్న, ప్రభాకర్, బ్రహ్మం, రంగస్వామి, సిద్ధు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

అయిజ: ఎస్సీ ఉప కులాల ఆధ్వర్యంలో అక్టోబర్ 21న ఇందిరాపార్క్‌లో నిర్వహించనున్న ‘చలో హైదరాబాద్’ నిరసన దీక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్సీ ఉప కులాల రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటన్న అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిరసన దీక్షకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో ఉప కులాల జిల్లా అధ్యక్షుడు రామచంద్రుడు, ప్రధాన కార్యదర్శి నాగరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆరుకుందు, మాల దాసరి జిల్లా ఉపాధ్యక్షుడు బీరయ్య, బుడుగ జంగం జిల్లా అధ్యక్షుడు వీరేష్, బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులతో పోరాటాలు ఆపలేరు



పట్టణ పోలీస్‌స్టేషన్‌లో నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు

గద్వాల అర్బన్: అక్రమ అరెస్టులతో పోరాటాలను ఆపలేరని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రానికి వస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌కు రైతుబంధు, రైతు రుణమాఫీని అమలు చేయాలని విషయంపై వినతిపత్రం ఇవ్వడానికి బయలుదేరిన నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులను, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేసి పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా రంజిత్‌కుమార్ మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై మంత్రికి వినతిపత్రం ఇవ్వడానికి వెళ్తుంటే అక్రమంగా అరెస్ట్ చేయడం సరికాదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బుచ్చిబాబు, శ్రీనివాస్‌యాదవ్, నాగరాజు, రంగస్వామి, మునెప్ప తదితరులు ఉన్నారు.

రేపటి నుంచి అగ్నిగుండ మహోత్సవాలు



పరుశవేదీశ్వరస్వామి ఆలయం

జడ్చర్ల టౌన్: మండలంలోని దుందుభీ వాగు తీరాన ఉన్న మీనాంబరం పరుశవేదీశ్వర ఆలయంలో ఆదివారం నుంచి రెండు రోజులపాటు అగ్నిగుండ మహోత్సవాలు నిర్వహించారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. ప్రతి ఏటా ఆశ్వయుజ మాసం తదియ తిథి నుంచి రెండు రోజులపాటు అగ్నిగుండ మహోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా మొదటి రోజు ఆదివారం ఉదయం 6 గంటలకు ప్రాతఃకాల పూజలు, 9 గంటలకు రుద్రాభిషేకం, బిల్వార్చనలు, మంగళహారతి, 10గంటలకు రుద్ర హోమం నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటలకు అగ్నిగుండ స్థల పూజ, సమిధలు పేర్చుట, 5:30 గంటలకు గణపతిపూజ, స్వామి, అమ్మవార్లకు అభిషేకం, వీరభద్రస్వామికి రుద్రాభిషేకం, బిల్వార్చనలు, రాత్రి 9 గంటలకు భజన కార్యక్రమాలు నిర్వహిస్తారు. అర్ధరాత్రి 1:15 గంటలకు వీరభద్రస్వామికి నందికోళ్ల సేవ, సోమవారం తెల్లవారుజామున 5 గంటలకు అగ్నిగుండ మహోత్సవం, 10 గంటలకు శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయ చైర్మన్ గోపాల్ తెలిపారు.

విద్యార్థికి సన్మానం



గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని దౌదర్‌పల్లికి చెందిన విద్యార్థి ఎండీ అప్సర్ నీట్ ఫలితాల్లో 588 మార్కులతో ఉత్తమ ర్యాంక్ రావడంతో మహబూబ్‌నగర్ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించాడు. ఈ సందర్భంగా దౌదర్‌పల్లి గ్రామస్తులు విద్యార్థి అప్సర్‌ను శాలువాతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో టీఎన్ఆర్ జగదీష్, నాగరాజు, నర్సింహులు, హన్మంతు, బాబు, హరికృష్ణ, సల్మాన్ తదితరులు ఉన్నారు.

అంకితభావంతో పనిచేయాలి



మానవపాడు: మండల వనరుల కేంద్రంలో శుక్రవారం ఎస్‌జీటీ టీచర్‌గా గోవిందమ్మకు ఎంఈఓ శివప్రసాద్ జాయినింగ్ ఆర్డర్ అందించారు. ఈ సందర్భంగా గోవిందమ్మ ఉండవెల్లి మండలంలోని పుల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్‌గా విధుల్లో చేరారు. కార్యక్రమంలో ఎంఎస్ కోఆర్డినేటర్ వీరేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండేలా పరీక్షలు



సిబ్బందికి పరీక్షలు నిర్వహిస్తున్న ఎస్‌ఐ

కొత్తకోట రూరల్: ప్రతి పోలీసు అధికారికి చట్టాలపై పూర్తి స్థాయిలో అవగాహన ఉండే విధంగా జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఆదేశానుసారం శుక్రవారం కొత్తకోట పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి సిబ్బందికి పరిజ్ఞాన పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షల ద్వారా సిబ్బంది కేసుల పరిశోధన ఎలా చేయాలి, కేసు వివరాల నమోదు, క్షేత్ర స్థాయిలో కేసుకు సంబంధించిన ఆధారాలు ఎలా రాబట్టాలి అనే అంశాలపై పరిజ్ఞాన సామర్థ్యాన్ని తెలుసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కొత్త చట్టాలపై అవగాహన, కేసుల పరిశోధన గురించి, భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) వంటి కొత్త చట్టాలపై పూర్తి అవగాహన కలిగే విధంగా ప్రతి అధికారిని తయారు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు.

క్రీడాప్రాంగణ సూచిక బోర్డు తొలగింపు



పత్తిచేను వద్ద బోర్డు తొలగించిన దృశ్యం

అమరచింత: మండలంలోని మస్తీపురంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణంలో పత్తి చేను సాగు చేస్తుండడంతో ప్రభుత్వ లక్ష్యం నీరు గారిందని ఈనెల 15 న సాక్షి దినపత్రికలో ‘లక్ష్యం..నిర్లక్ష్యం’ అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు మస్తీపురం గ్రామంలోని క్రీడా ప్రాంగణానికి సంబంధించిన సూచిక బోర్డును అక్కడి నుంచి తొలగించి ప్రభుత్వ పాఠశాల ముందు ఏర్పాటు చేశారు. ఈమేరకు ఎంపీడీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ స్థల వివాదం కారణంగా సూచిక బోర్డును తాత్కాలికంగా అక్కడి నుంచి తొలగించామన్నారు.



పాఠశాల ఎదుట ఏర్పాటు చేసిన సూచిక బోర్డు